క్లుప్తంగా

రైతుల ఖాతాల్లో నష్ట పరిహారం

కారంచేడు: గత ఏడాది డిసెంబర్ నెలలో వచ్చిన అకాల వర్షాలు, తుఫానుల కారణంగా అప్పటికే పంటలను సాగు చేసి ఆ పంటలను పూర్తిగా నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం నుంచి విడుదలైన నగదు జమలు అవుతున్నాయని వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది వచ్చిన తుఫానులతో మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో పంటలు సాగు చేసిన రైతుల్లో 3745 మంది రైతులకు గాను రూ. 4.76 కోట్లు నగదు విడుదల అయిందన్నారు. ఇప్పటికే ప్రతి రైతుకు సంబంధించిన బ్యాంకు ఖాతాల వివరాలను నమోదు చేశామన్నారు. వీరందరికీ విడుదల అయిన నగదు జమ అవుతుందన్నారు. ఇప్పటికే 40 శాతానికి పైగా జమ అయ్యాయన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలో జమ అవుతాయన్నారు. రైతులు మీ ఖాతాలను సరి చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ పోయవద్దు


ఎస్సై కేకే తిరుపతిరావు

జె. పంగులూరు: ఎన్నికల నియమ నిబంధనలో భాగంగా మండల పరిధిలో ఉన్న పెట్రోల్ బంకుల్లో, బంకు యజమానులు బాటిల్‌లో లూజు పెట్రోల్ పోయవద్దని గురువారం ఎస్సై కేకే తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రి ఎన్నికల నేపథ్యంలో జరిగిన సంఘటనలు దృష్ట్యా ఈ నియమ నిబంధనలు ఆమల్లో ఉంటాయని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా చెరువుల్లో మట్టి తవ్వకాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అదనపు అర్హతతో గుర్తింపు


విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు (అద్దంకి): విద్యార్థులకు అదనపు అర్హతతో గుర్తింపుతోపాటు ఉపయోగాలుంటాయని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆయన స్థానిక గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథపాలకుడు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో స్పోకెన్ ఇంగ్లిష్, వివిధ రకాల ఆటలు కథలు చదవడం నేర్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోండి


బల్లికురవలో రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 104 వాహనం ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ అన్నారు. గురువారం బల్లికురవలోని సబ్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులు బాలింతలు గర్భిణులకు వివిధ రకాల పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారులను సాయంత్రం ఇంటింటికీ వెళ్లి పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. ఎండల ఉధృతి పెరుగుతుందని వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతేనే బయటకు రావాలని వైద్యాధికారి వివరించారు. ఈ శిబిరంలో ఎస్‌ఎం అనూషా, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ పెట్టండి


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారులు

అద్దంకి రూరల్: ప్రజారోగ్యం పట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది శ్రద్ధ వహించి విధులు నిర్వహించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి టి. వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక గీతామందిరం కల్యాణ మండపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో రోగుల వివరాలు పొందుపరచాలన్నారు. జిల్లా గణంకాధికారి పి. వేణు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేపడుతున్న ఆరోగ్య సేవలు గర్భిణుల నమోదు, కాన్పుల వివరాలు, రక్తహీనత, వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు పాఠశాలలో ఆరోగ్యకార్యక్రమాల నిర్వహణపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు శ్రీహర్ష, హరికృష్ణ, పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కు ముఖ ద్వారం


నీటిలో ఆహ్లాదంగా బోటింగ్ చేస్తున్న చిన్నారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

- అన్ని హంగులతో మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కు
- రూ. 30 లక్షలతో పార్కును ఆధునికీకరించిన అధికారులు
- సెలవుల్లో సేద తీరుతున్న చిన్నారులు

చీరాల రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక వైపు ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు ఎదురుగా మున్సిపల్ అధికారులు నిర్మించిన మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కు చిన్నారులకు ఎంతో ఆహ్లాదకరంగా మారింది. ప్రస్తుతం చిన్నారులకు వేసవి శెలవులు కావడంతో చిన్నారులు, విద్యార్థులు ఇళ్లవద్దనే ఉంటున్నారు. దానికి తోడు మండుతున్న ఎండలకు చిన్నారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అందుకే సాయంత్రం అయితే చాలు చిన్నారులను ఆటలాడించేందుకు తల్లి దండ్రులు మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కుకు క్యూ కడుతున్నారు.

రూ. 30 లక్షలతో

గతంలో ఉన్న చిల్డ్రన్స్ పార్కును మున్సిపల్ అధికారులు పస్తుతం ఎంతో ఆహ్లాదకరంగా మలిచారు. సాయంత్రం 4 గంటల నుంచి 8:30 గంటల వరకు తెరచి ఉంటుంది. ఈ పార్కు అనేక రకాల ఆట వస్తువులకు నిలయంగా మారింది. కొత్తగా రూ. 20 లక్షలతో వాటర్ బోటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో


జంపింగ్ నెట్‌లో జంప్ చేస్తున్న చిన్నారులు

చిన్నారులు నీళ్లలో బోటింగ్ చేస్తూ షికార్లు చేస్తున్నారు. పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైవేటు ఎగ్జిబిషన్‌లో చిన్నారులు పదినిమిమిషాల పాటు బోటింగ్ చేస్తే ఒక్కొక్కరికి రూ. 100 చార్జ్ వసూలు చేస్తున్నారు. మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన ఈ బోటింగ్‌లో అయితే చిన్నారులకు ఎటువంటి ఫీజులు వసూలు చేయడంలేదు. అలానే మరో రూ. 30,000తో ఏర్పాటు చేసిన జంపింగ్ నెట్‌లో చిన్నారులు చక్కగా జంపింగ్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. పార్కులో పూర్తిస్థాయిలో అన్ని వైపులా లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక పార్కులో రంగుల రాట్నాలు, ఊయల బల్లలు, జారుడు బండలు వంటి ఆట వస్తువులతో చిన్నారులు ఎంతో సంతోషంగా గడుపుతున్నారు. చిన్నారులు మరింత ఆనందంగా ఉండేందుకుగాను పార్కు మధ్యలో అధికారులు పెద్ద స్టేజీ ఏర్పాటు చేశారు. ఈ స్టేజీపై డీజే సౌండ్స్‌తో మిరుమిట్లు గొలిపే లైటింగ్స్ మధ్య సినిమా పాటలను ఏర్పాటు చేశారు. పచ్చదనం కోసం క్రోటన్ మొక్కలును ఏపుగా పెంచారు. దీంతో పార్కు మొత్తం పచ్చదనంతో నిండిపోయింది. మంచిటి సౌకర్యంతో పాటు టాయిలెట్లు కూడా ఏర్పాటు చేశారు. గతంలో పాఠశాలల్లో పుస్తకాలతో బిజీగా గడిపి కుస్తీలు పట్టిన చిన్నారులు అక్కడ పడిన శ్రమనంతా మరచిపోతూ పార్కులోని ఆట వస్తువులతో ఆనందంగా గడుపుతున్నారు.


చిన్నారులను ఊయలలూపుతున్న తల్లిదండ్రులు


జారుడు బల్లపై జారుతున్న చిన్నారులు

అంతర్జాతీయ క్రీడాకారుడికి రూ.1 లక్ష విరాళం

వేటపాలెం: అంతర్జాతీయ వాలీబాల్ దివ్యాంగ క్రీడాకారుడు పిచ్చుక నాగరాజుకి వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ ద్వారా సమకూర్చిన రూ.1లక్ష విరాళాన్ని ఆ సంస్థ ఏపీ కన్వీనర్ దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందిళ్లపల్లికి చెందిన అంతర్జాతీయ దివ్యాంగ క్రీడాకారుడు నాగరాజు వరల్డ్ వాలీబాల్ పోటీలకు ఇండియా తరఫున ఎంపికయ్యారన్నారు. ఈ నెల 28 నుంచి చైనాలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. పేద క్రీడాకారుడు నాగరాజుకు చైనా వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సహకారం కోరాడు. ఈ విషయాన్ని బీరక సురేంద్ర ఫౌండర్ చైర్మన్ అంజన్ కార్నాటి, ఫౌండర్ రమేష్ మునుకుంట్ల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చేనేత యువకుడు ఉన్నత స్థాయికి దోహదపడాలని సదుద్దేశంతో ఆర్థిక సహకారం అందించారు. వాలీబాల్ పోటీల్లో గెలుపొంది దేశానికి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షుడు దేవన వీర నాగేశ్వరరావు, బీరక సురేష్, పన్నెం సుబ్రహ్మణ్యం, చింతా ప్రభాకర్, పన్నెం సుబ్బారావు, చింతం గంగాదర్, పృధ్వీ నాగరాజు, యశ్వంతరావు, హరీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.


క్రీడాకారుడు నాగరాజుకి నగదు అందజేస్తున్న బీరక సురేంద్ర

ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించండి

చీరాల టౌన్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు కలిగి ఉన్న ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో దాసు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో దాసు మాట్లాడారు. చీరాల మండలంలోని 15 పంచాయతీల్లో 10 గ్రామ పంచాయతీల్లో ఉన్న ఉపాధి కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు పని కల్పించాలన్నారు. టీఏలు, గ్రామాల ఫీల్డు అసిస్టెంట్లున్నారు.

నర్సరీల నిర్వహణకు లైసెన్సులు తప్పనిసరి


మార్టూరులో నోటీసులు అందిస్తున్న ఉద్యానవన శాఖాధికారి

మార్టూరు: నర్సరీలు నిర్వహించే యాజమాన్యాలు తప్పనిసరిగా ఉద్యానవన శాఖ అధికారుల నుంచి లైసెన్సు పొందాలని, లేదంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మండల ఉద్యానవన శాఖాధికారి బి. హనుమంతు నాయక్ తెలిపారు. మండలంలోని నర్సరీ యజమానులకు గురువారం ఆయన నోటీసులు అందించి మాట్లాడారు. ఇవి అందిన 7 రోజుల్లోపు అవసరమైన ఆధారాలతో స్థానిక ఉద్యానవన శాఖాధికారి ద్వారా బాపట్ల జిల్లా ఉద్యానవన శాఖాధికారికి లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నర్సరీల యజమానులు సొంతగా విత్తనాలు కొనుగోలు చేసి నారు పెంచిన కొనుగోలు చేసిన విత్తనాలు రసీదులను భద్రపరచాలని తెలిపారు. అలాగే విత్తనాలకు సంబంధించి రైతుల నుంచి నర్సరీల యజమానులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. బబ్బేపల్లి ద్రోణాదుల, దరిశి, జొన్నతాళి తదితర గ్రామాల్లోని నర్సరీల్లో నోటీసులు అందించారు.

చీరకు నిప్పంటుకుని మహిళకు గాయాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రమాదశాత్తు చీరకు నిప్పంటుకుని మహిళకు గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన పున్నాయమ్మ గురువారం గ్రామంలోని బాల ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో దీపారాధన చేస్తుండగా చీరకు నిప్పంటుకుంది. స్థానికులు మంటలను ఆర్పి నరసరావుపేట వైద్యాశాలకు తరలించారు.

లక్ష తమలపాకుల పూజ

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష తమలపాలకులతో పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం సుప్రభాతం, గోపూజ, బందె తీర్థం స్వామివారికి అభిషేక కార్యక్రమం అలంకరణ, వేదపండితులు అర్చకులు ఉభయదాతలు, వేదస్వస్తి మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ వినాయక స్వామి వారికి సుబ్రహ్మణ్య స్వామికి వారికి జీవధ్వజ, ఉష్టవాహనానికి నారికేళ ఫల సమర్పణ చేశారు. గణపతి పూజ, రుత్విగ్వరణ, తరువాత 11 వరుసల్లో దేవస్థాన వేదపండితుల అర్చకులు లక్ష తమలపాకులతో స్వామికి పూజ నిర్వహించారు. తరువాత మహానివేదన, సంచహారతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలు గుంటూరు వాస్తవ్యులు శ్రీ న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు తరఫున అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ సుభద్ర పర్యవేక్షించారు.


లక్ష తమల పాకుల పూజలో ప్రసన్నాంజనేయ స్వామి

సౌకర్యాలు లేకుండా పాఠశాల ఎలా నిర్మిస్తారు?

చినగంజాం: విద్యార్థులకు అవసరమైన సరైన వసతి సౌకర్యాలు లేకుండా పాఠశాల నిర్మాణం ఎలా చేస్తారంటూ జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి ,మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ మూలగానివారి పాలెం గ్రామ పరిధిలో నిర్మాణం జరుపుతున్న ఓ ప్రైవేట్ పాఠశాలను గురువారం వారు సందర్శించారు. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని రకాలైన మౌలిక వసతులను కల్పిస్తూ విద్యను అందిస్తుంటే ప్రైవేట్ పాఠశాలలు మాత్రం కనీస వసతులు కూడా లేకుండా నిర్మాణం చేయటం సరైన విధానం కాదని వారి ఇరువురు ఎంఈఓ బి. అజయ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. గురువారం వారు పాఠశాల స్థలాన్ని సందర్శించి నిర్మాణం జరుగుతున్న తీరును పరిశీలించారు. సరైన వసతులు లేక దానికి తగిన అనుమతులు లేకుండా పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలిగే విధంగా నిర్మాణం జరుపుతుంటే పంచాయతీ తరఫున అనుమతులు ఇచ్చేందుకు కూడా అవకాశం ఇవ్వబోమని వారు తెలియజేశారు. ఈ విషయమై ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చినగంజాం జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కె. రామాంజనేయులు, సీఆర్పీ సురేంద్ర పాల్గొన్నారు.


పాఠశాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, ఎంఈఓ తదితరులు

కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని చెరుకూరులో కొలువైన త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మంత్రం స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సుమారు 3వేల మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. నాగయ్య, సిబ్బంది, అర్చకలు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయనం వైశాఖ మాసం అనూరాధ నక్షత్రం పాడ్యమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఘనంగా నరసింహ స్వామి గ్రామోత్సవం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని మాధవ స్వామి దేవస్థానంలో బుధవారం నరసింహస్వామి కల్యాణోత్సాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి నరసింహస్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లు పోసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


గ్రామోత్సవంలో నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు

పెయింటర్‌కు తీవ్ర గాయాలు

జె.పంగులూరు: ఇంటికి రంగు వేస్తూ జారి పై నుంచి కింద పడ్డ పెయింటర్‌కు తీవ్ర గాయాలు అయిన సంఘటన మండల కేంద్రమైన పంగులూరులో గురువారం జరిగింది. పంగులూరు దళిత కాలనీకి చెందిన దాసరి రాంబాబు అనే యువకుడు గత కొన్ని సంవత్సరాలుగా పెయింటింగ్ పని చేస్తున్నాడు. గురువారం పంగులూరు గ్రామంలో ఒక ఇంటికి పెయింటింగ్ వేస్తూ జారి గోడపై పడి అక్కడి నుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రాంబాబుకు చెవుల నుంచి కూడా రక్తం కారుతున్నట్లు తెలిసింది. రాంబాబును ఒంగోలులోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి చేర్పించినట్లు తెలిసింది.

కోటప్పకొండలో హనిమి రెడ్డి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో హనిమి రెడ్డి

అద్దంకి: పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండలో అద్దంకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన త్రికూటేశ్వర స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను సేవించి అర్చకుల ఆశీర్వాదాన్ని అందుకున్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు

కారంచేడు: సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించాల్సి ఉందని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం వారు మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించే ప్రక్రియను పరిశీలించారు. ఈ నెల 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు మండలంలోని ఐఈఆర్‌పీలు ప్రతి గ్రామంలో సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వే సమయంలో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయాల సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ఇప్పటికే మండలంలో 15 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు వసంతబాబు, విజయ్‌కుమార్, కోటి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కుంకలమర్రులో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేలో పాల్గొన్న ఐఈఆర్‌పీలు

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం చేయూత

వేటపాలెం: దివ్యాంగ విద్యార్థులకు అన్నిరకాలుగా ప్రభుత్వం చేయూత ఇస్తుందని ఎంఈఓ పురుషోత్తమరావు తెలిపారు. మండల పరిధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ఎంఈఓ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు వివిధ రకాల దివ్యాంగులను గుర్తిస్తామని తెలిపారు. చెవిటి, మూగ, మానసిక, ఆర్టిజన్, మస్తిష్కపక్షవాతం, ఫిజికల్ హ్యాండీక్యాప్డ్, తల సేమియా, పార్కిన్సన్‌తో పాటు ప్రత్యేక అసరాలు పిల్లలను గుర్తించి వారిని స్కూల్స్‌లో అడ్మిషన్ ఇప్పించడం జరుగుతుందన్నారు. వారికి కావాల్సిన మెడికల్ సర్టిఫికెట్స్, దివ్యాంగుల నెలవారి పెన్షన్ ప్రభుత నుంచి వచ్చేరాయితీను అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగించు కోవాలని సూచించారు.


ఇంటింటి సర్వే పరిశీలిస్తున్న ఎంఈఓ పురుషోత్తమరావు

వైభవంగా కల్యాణ మహోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు


యద్దనపూడి: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

వేటపాలెం: రామన్నపేటలోని ప్రధాన రహదారి పక్కన గల తిరుపతమ్మ దేవస్థానం వద్ద లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల కళ్యా మహోత్సవం గురువారం వైభవంగా పండితులు నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పృధ్వి చెంచు సుబ్బారావు, నాగవేణి పీటలపై కూర్చొని అమ్మవారి కళ్యాణ కార్యక్ర మం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారి పుట్టింటి వారు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ఊరేగింపుగా దేవస్థానం వద్దకు చేరుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పన గావించారు. జెడ్పీటీసీ బండ్ల తిరుమ లాదేవి, బండ్ల బాబు, గుమ్మడి సుశీల తదితరులు పాల్గొన్నారు.

కమనీయం వేణుగోపాలుని కల్యాణం

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ వేడుక గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గరుడవాహనంపై స్వామివారు కొలువై ఉండగా అర్చకులు స్వామివారి ఉత్సవరులను కల్యాణవేదికపై ప్రతిష్ఠించారు. ముత్యాల తలంబ్రాల వేడుక కడు రమణీయంగా సాగింది.

వైదనలో పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

బల్లికురవ: పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవత పోలేరమ్మ నాభిశిలకు గురువారం ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని వైదన గ్రామంలోని శివాలయం ప్రక్కన వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ ఆలయ 29 వార్షికోత్సవం తిరునాళ్ల వేడుకల్లో భాగంగా గ్రామస్తులు మేళతాళాలు డప్పువాయిద్యాలతో గ్రామోత్సవంగా ఆలయం వద్దకు తరలి వెళ్లారు. నాభిశిలకు పోలేరమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించారు. బంధు మిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తిరునాళ్ల వేడుకలు జరపకుండా, మొక్కులు మాత్రమే చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.


వైదనలో గ్రామోత్సవం


వైదన: అలంకరణలో పోలేరమ్మ తల్లి